సాక్షి
కర్నూలు
బుధవారం ।14 । ఫిబ్రవరి । 2024



చిన్నారుల గుండె విలవిల!
ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా వెయ్యి మంది పిల్లలు గుండె జబ్బులతో జన్మిస్తున్నారు. మేనరికపు వివాహాలు, గర్భస్థ ఇన్ఫెక్షన్లు, పోషకాహార లోపం చిన్నారులకు శాపమవుతున్నాయి. - 8లో▸



కేసీ కాల్వకు నీటి విడుదల
గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు మంగళవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు.



అన్నదాన పథకానికి విరాళం
శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన చింతల అన్నపూర్ణ రూ.1,00,116 విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల తనిఖీ



కపటిలో ఏర్పాట్లపై సిబ్బందితో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: మండలంలోని పెసలబండ, కపటి, సుల్తానాపురం, మాంత్రికి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలను కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ హాసీనాసుల్తానా, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నేడు ఓర్వకల్లు మండలంలో సెంట్రల్ టీమ్ పర్యటన

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు, ప్రధానమంత్రి ఆవాజ్ యోజన(పీఎంఏవై) గృహ నిర్మాణాలను పరిశీలించేందుకు సెంట్రల్ టీమ్ బుధవారం జిల్లాకు రానుంది. జాతీయ సమీకృత గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన 28 మంది నాన్ కేడర్ అధికారులు ఓర్వకల్లు మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓర్వకల్లు మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తారని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా డీపీ కొండయ్య

కర్నూలు(అర్బన్): జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా డీపీ కొండయ్యను నియమిస్తూ డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమల ట్రాఫిక్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఈయనను ఇక్కడకు బదిలీ చేశారు. ఇటీవల పలువురు సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్స్ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఈ బదిలీలు చేపట్టారు.

నేడు డిజిటల్ అసిస్టెంట్లకు వర్క్‌షాప్

కర్నూలు(అర్బన్): గ్రామ/వార్డు సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లు, వార్డు ఎడ్యుకేషన్ డాటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌పై బుధవారం వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నామని, జిల్లాలోని ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు సంబంధిత డిజిటల్ అసిస్టెంట్లు, డబ్ల్యూఈడీపీఎస్‌లు వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు వీలుగా వారికి అనుమతి మంజూరు చేయాలని కోరారు.

బొప్పాయి సాగు కలిసొచ్చింది



ఒక ఎకరాలో బొప్పాయి సాగు చేస్తున్నా. సాగుకు పెట్టిన పెట్టుబడి రూ.1.50 లక్షలు. ఇప్పటి వరకు 30 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ.12వేల నుంచి రూ.25 వేల వరకు విక్రయించాం. సగటున టన్నుకు రూ.16 వేల ప్రకారం ధర లభించింది. ఇప్పటి వరకు రూ.4.80 లక్షలు పొందాం. ఇంకా 15 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. బొప్పాయి సాగు బాగా కలసి వచ్చింది.
– పి.రామకృష్ణ, రామళ్లకోట, వెల్దుర్తి మండలం

ఉద్యాన పంటలతో లాభాలు



కొన్నేళ్లుగా ఉద్యాన పంటల సాగులో రాణిస్తున్నా. ఒక ఎకరాలో మల్లె, మరో ఎకరాలో జామ సాగు చేశాం. మల్లె 10 ఏళ్ల క్రితం పెట్టాం. ఏడాదికి అన్ని ఖర్చులు పోయి రూ.1.50 లక్షల వరకు నికరాదాయం ఉంటోంది. రెండేళ్ల క్రితం నుంచి జామ సాగు కూడా చేస్తున్నాం. ఇందులో అంతర పంటగా చిక్కుడు వేస్తున్నాం. ఏడాదికి అన్ని ఖర్చులు పోను ఏడాదికి రూ.లక్ష వరకు నికరాదాయం పొందుతున్నాం. ఉద్యాన పంటల సాగు సంతృప్తికరంగా ఉంది.
– అబ్దుల్‌సుకూర్, దొడ్డిపాడు, కల్లూరు మండలం

పంట కొత్తగా.. లాభాలు తియ్యగా!

వర్షాభావంలోను రికార్డు స్థాయిలో ఉద్యానం

- నీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం చొరవ
- 2,41,582 ఎకరాల్లో సాగులో ఉద్యాన పంటలు
- 2023-24 సంవత్సరంలో 27,40,144 టన్నుల దిగుబడి
- భారీగా పెరిగిన సుగంధ ద్రవ్యాల పంటలు
- కర్జూర, ద్రాక్ష, వక్క సహా అన్ని రకాల పండ్ల తోటలు



వెల్దుర్తి మండలం రామళ్లకోట సమీపంలో ఏపుగా పెరిగిన బొప్పాయి మొక్కలు, ఇన్‌సెట్‌లో విరగ్గాసిన కాయలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన పంటలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. రైతులు కొత్త రకం పంటలపై దృష్టి సారిస్తున్నారు. జిల్లాలో వక్క, కర్జూరం, ఆయిల్‌పామ్, నన్నారి, డ్రాగన్ ఫ్రూట్ తదితరాలు సాగవుతున్నాయంటే రైతులు ఏస్థాయిలో ఈ పంటలపై ఆసక్తి చూపుతున్నారో అర్థమవుతోంది. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో బిందు, 55 శాతం సబ్సిడీతో తుంపర్ల సేద్య సదుపాయం కల్పిస్తోంది. అందువల్లే ఏడాదికేడాది ఉద్యాన పంటల సాగు పెరుగుతోంది. 2023-24 సంవత్సరంలో ఉద్యాన పంటల సాధారణ సాగు 1,45,943 ఎకరాలు ఉండగా.. ఈ-క్రాప్ ప్రకారం ఈ ఏడాది 2,41,582 ఎకరాల్లో సాగవడం విశేషం. రైతులు సాంప్రదాయ వ్యవసాయ పంటల నుంచి ఉద్యాన పంటలవైపు మళ్లుతున్నారనేందుకు పెరిగిన సాగు విస్తీర్ణమే నిదర్శనం.

కొత్త పంటల సాగుపై ఆసక్తి

జిల్లాలో అన్ని రకాల ఉద్యాన పంటల సాగుకు అనువైన నేలలు ఉండటం బాగా కలసి వస్తోంది. జిల్లాలో యాపిల్ మినహా దాదాపు అన్ని రకాల పండ్లతోటలు సాగులో ఉన్నాయి. ప్రధానంగా కర్జూర, వక్క, ఆయిల్‌పామ్, మామిడి, దానిమ్మ, సపోట, డ్రాగన్‌ఫ్రూట్స్, నేరేడు, బొప్పాయ, సీతాఫలం, నిమ్మ, జామ, చీని, రేగు తదితర పండ్లతోటలు అభివృద్ధి చెందాయి.

- క్రిష్ణగిరి మండలంలో ద్రాక్ష కూడా సాగులో ఉండటం విశేషం.
- కర్నూలు, ఆదోని డివిజన్‌లో కర్జూర కూడ సాగు అవుతోంది. నన్నారి పంట కూడ సాగులో ఉంది.
- సీ.బెళగల్ మండలంలో ఆయిల్‌పామ్ సాగవుతోంది.
- ఆలూరు, చిప్పగిరి మండలాల్లో వక్క సాగులో ఉంది.
- కాప్సికం, క్యాలీఫ్లవర్, క్యారెట్‌తో సహా అన్ని రకాల కూరగాయల పంటలు, అన్ని రకాల పూల తోటలు అభివృద్ధి చెందాయి.
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 5 ఎకరాల్లోపు రైతులకు 100 శాతం సబ్సిడీతో పండ్లు, పూల తోటలు అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంది. చెరువుల కింద వరికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటల సాగుకు 75 శాతం సబ్సిడీ లభిస్తోంది.

2022-23 ఖరీఫ్‌లో ఉద్యాన పంటల 2.38 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. వర్షాభావం నేపథ్యంలోనూ ఈ సారి రికార్డు స్థాయిలో 2.41 లక్షల ఎకరాల్లో పంటలు సాగులో ఉండటం విశేషం.



కరివేపాకు తోట

27.40 లక్షల టన్నుల ఉద్యాన ఉత్పాదకత

ఈ ఏడాది ఉద్యాన పంటల్లో ఉత్పాదకత గణనీయంగా పెరిగింది. సగటు దిగుబడుల ప్రకారం ఉత్పాతకత(ప్రొడక్టివిటీ)27,40,144 టన్నులు వచ్చే అవకాశం ఉందని ఉద్యాన అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది సుగంధ ద్రవ్యాల పంటలైన ఎండుమిర్చి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. 2022-23లో ఎండుమిర్చికి రికార్డు స్థాయిలో ధరలు ఉండటం వల్ల 2023-24లో మిర్చి సాగు పెరిగేందుకు కారణమైంది. ఈ సారి రికార్డు స్థాయిలో 1,59,758 ఎకరాల్లో మిర్చి సాగవుతోంది. మిరపలో జంట సాళ్ల పద్ధతిని చేపట్టడం, సూక్ష్మ సేద్య సదుపాయాన్ని వినియోగించుకోవడం, మల్చింగ్ ఏర్పరచుకోవడం తదితర కారణాల వల్ల దిగుబడులు పెరుగుతున్నాయి. జిల్లాలో 336 హెక్టార్లలో ఔషధ పంటలు కూడా సాగవుతున్నాయి. అశ్వగంధం కూడా జిల్లాలో సాగులోకి వచ్చింది. ఔషధ పంటల దిగుబడి 218 టన్నులు ఉండే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అంచనా వేసింది. కూరగాయల పంటల్లో 16,60,411 టన్నుల దిగుబడులు వస్తున్నాయి.

జిల్లాలో 2023-24లో సాగైన ఉద్యాన పంటలు, ఉత్పాదకత ఇలా..

పంట రకం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	ఉత్పాదకత (టన్నుల్లో)
పండ్ల తోటలు	10,758	1,78,022
కూరగాయలు	69,145	16,60,411
పూలు	1,258	7,889
సుగంధ ద్రవ్యాలు	1,59,758	9,73,604
ఔషధ పంటలు	336	218
ప్లాంటేషన్ క్రాప్స్	57	-
మొత్తం	2,41,582	27,40,144

పుష్కలంగా నీటి వనరులు



నీటి వనరుల అభివృద్ధిపై వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందువల్ల ఉద్యాన పంటల సాగు పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. హంద్రీనీవా కాలువ పారుతుండటం, ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని పలు మండలాల్లోని చెరువులను కృష్ణా జలాలతో నింపడం, ఇప్పటికీ చెరువుల్లో నీరు ఉండటం వల్ల భూగర్భ జలాలు కూడా మెరుగ్గా ఉన్నాయి.

కరువు నివారణకు దోహదం



కరువు పరిస్థితులను ఎదుర్కోవడానికి, వలసలు నివారణకు ఉద్యాన పంటల అభివృద్ధి కీలకం. ఏడాది పొడవునా పంటలు ఉండటంతో కూలీలకు పని దొరుకుతుంది. ఉద్యాన పంటల సాగుతో రైతులకు నికరాదాయం కూడా పెరుగుతుంది. ప్రభుత్వం కూడా సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఈ ఏడాది ఉద్యాన పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు కలెక్షన్ సెంటర్లు కూడా ఏర్పాటు చేశాం. వీటిని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు నిర్వహిస్తున్నాయి.
– రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయండి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన





మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి విశ్వకర్మయోజన ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి బ్యాంకులకు పంపి రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన పరిశ్రమల శాఖ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పీఎం విశ్వకర్మ యోజన ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని సంప్రదాయ కులవృత్తులు, హస్తకళాకారులకు రుణాలు మంజూరు చేసి బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ పథకానికి ఉమ్మడి జిల్లాల నుంచి 1,46,284 దరఖాస్తులు వచ్చాయని, రుణాల మంజూరు కోసం వాటిని త్వరగా బ్యాంకులకు పంపాలన్నారు. పరిశ్రమల స్థాపన కోసం వచ్చిన 158 దరఖాస్తుల్లో 149కి అనుమతులు మంజూరు చేశామని, ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకానికి వచ్చిన 129 దరఖాస్తులకు, ఖాదీ, గ్రామ పరిశ్రమల బోర్డు ద్వారా పరిశ్రమల స్థాపన కోసం వచ్చిన 58 దరఖాస్తులకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. పీఎంఈజీపీ నిబంధనల ప్రకారం బ్యాంకులు రుణాలు మంజూరు చేయడంలేదని, ఈ విషయాన్ని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తగిన మార్గదర్శకాలను రూపొందించేందుకు జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీలో చర్చిస్తామన్నారు. అనంతరం పరిశ్రమల ప్రోత్సాహకాలకు 26 క్లెయిమ్‌లకు రూ.1.18 కోట్ల సబ్సిడీలకు కమిటీ ఆమోదం తెలిపింది. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ఎస్ఎస్ఆర్‌సీఎం ప్రసాదు, ఏపీఐఐసీ జెడ్ఎం సోమశేఖరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, డీపీఓ నాగరాజునాయుడు, కాలుష్య నియంత్రణ అధికారి మునిప్రసాదు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ ఐ.విజయకుమార్‌రెడ్డి, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజమహేంద్రనాథ్, పీఎం విశ్వకర్మ యోజన కమిటీ సభ్యులు నరసింహ వర్మ, కాశీ విశ్వనాథ్, మల్లేశ్వర రావు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ బ్రాంచీల్లో గోధుమ పిండి, శనగ పప్పు



గోధుమ పిండి



శనగ పప్పు

కర్నూలు(అగ్రికల్చర్): కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ అగ్రికల్చర్ ఫెడరేషన్(నాఫెడ్) తక్కువ ధరకే నాణ్యమైన నిత్యావసర వస్తువులను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం సూచనతో నాఫెడ్ ఈ సరుకులను వినియోగదారులకు అందుబాటులోకి ఉంచింది. నాణ్యత సంతృప్తికరంగా ఉండటంతో వినియోగదారులు కౌంటర్లకు పోటెత్తుతున్నారు. గోధుమపిండి, శనగపప్పులను డీసీఎంఎస్ కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు, ఆదోని బ్రాంచీల ద్వారా వినియోగదారులకు పంపిణీ చేస్తున్నారు. శనగ పప్పు కిలో ధర రూ.60, గోధుమ పిండి కిలో ధర రూ.27.50 ప్రకారం పంపిణీ చేస్తున్నారు. శనగ పప్పు కిలో ప్యాకెట్, గోధుమ పిండి 5 కిలోలు, 10 కిలోల ప్యాకెట్లతో లభిస్తున్నాయి. ఇప్పటి వరకు నాఫెడ్ కర్నూలులోని మార్కెట్ యార్డు డీసీఎంఎస్ బ్రాంచీకి 5 టన్నుల గోధుమ పిండి, 10 టన్నుల శనగపప్పు, ఆదోని డీసీఎంఎస్ బ్రాంచీకి గోధుమ పిండి 20 టన్నులు, శనగ పప్పు 10 టన్నుల ప్రకారం కేటాయించినట్లు డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రాజేష్ తెలిపారు. త్వరలోనే డోన్, కోడుమూరు బ్రాంచీలలోనూ సరుకులను అందుబాటులో ఉంచుతామన్నారు.

ఉపాధి పనులను విస్తరించండి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమరనాథ్ రెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): భూగర్భ జలాలు పెంచేందుకు ఉపయోగపడే పూడికతీత పనులను మరింత విస్తరించాలని డ్వామా పీడీ అమరనాథరెడ్డి సూచించారు. వెల్దుర్తి పట్టణ పరిధిలోని చెక్‌డ్యాం, బోయనపల్లె పరిధిలోని ఊట కుంటలలో జరుగుతున్న పూడికతీత ఉపాధి పనులను, రామళ్లకోటలో పండ్ల తోటలను మంగళవారం పరిశీలించారు. పూడిక తీత పనులకు హాజరును తనిఖీ చేసి, కూలీలతో మాట్లాడారు. వేతనాలపై ఆరా తీశారు. సరైన వేతనాలందుతున్నాయన్న కూలీల సమాధానంతో సంతృప్తి చెందారు. రామళ్లకోట మనోహర్ దానిమ్మతోటను పరిశీలించారు. వందశాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకానికి ఎన్ఆర్‌ఈజీఎస్ సహకరిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వెల్దుర్తి మండలంలో 500 ఎకరాల తోటల పెంపకానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఏపీఓ రాజునాయక్‌ను ఆదేశించారు. ఆయన వెంట టీఏలు నాగేశ్వరరెడ్డి, రఘునాథ్, శ్రీనివాసులు, పద్మావతి, ఎఫ్ఏలు ఉన్నారు.

ఆరోగ్య సమస్యలు తీర్చే సురక్ష శిబిరాలు

కర్నూలు(హాస్పిటల్): ప్రజల ఆరోగ్య సమస్యలను జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల ద్వారా తీరుతున్నాయని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారి డాక్టర్ శైలేష్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఆయన ఇ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జి. సింగవరం గ్రామంలోని సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్య శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు, రక్తపోటు, షుగర్, హిమోగ్లోబిన్, మూత్రపరీక్ష, గర్భిణులు, బాలింతలు, తగిన బరువు లేని పిల్లలకు పరీక్షలు, గళ్ల పరీక్షలతో పాటు జ్వరంతో బాధపడుతున్న వారికి మలేరియా, డెంగీ లాంటి ఏడు రకాల పరీక్షలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రూప్ వన్ ట్రైనీ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ మంజూష, ఎంపీహెచ్ఈఓ మెక్బూల్, హెచ్ఎస్ రఘు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా సుజయీంద్ర తీర్థుల ఆరాధన



బంగారు రథంపై సుజయీంద్ర తీర్థుల చిత్ర పటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పూర్వపు పీఠాధిపతి సుజయీంద్ర తీర్థుల ఆరాధన వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆశీస్సులతో ఆరాధన మహోత్సవాలు చేపట్టారు. ముందుగా సుజయీంద్ర తీర్థుల మూలబృందావనానికి జల, పుష్ప, పంచామృతాభిషేకాలు గావించి విరులతో విశిష్ట అలంకరణ చేశారు. అనంతరం ఊంజల మంటపంలో సుజయీంద్ర తీర్థుల చిత్రపటానికి శాస్త్రోక్త పూజలు నిర్వహించారు. ఆరాధన పురస్కరించుకుని బంగారు రథంపై స్వామి వారి చిత్ర పటాన్ని కొలువుంచి పుష్పార్చన, హారతులు పట్టి రథయాత్రకు పీఠాధిపతి అంకుర్పారణ పలికారు. మంగళ వాయిద్యాలు, భక్తుల హర్షధ్వానాల మధ్య రథోత్సవం రమణీయంగా సాగింది. వేడుకలో ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్ శ్రీనివాసరావు, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

కిడ్నాపర్ల అరెస్ట్



కిడ్నాపర్లను అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈనెల 3న నమోదైన బాలిక కిడ్నాప్ కేసును స్థానిక పోలీసులు ఛేదించారు. కిడ్నాపర్లను అరెస్ట్ చేసి బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు.. రామళ్లకోటకు చెందిన వృద్ధురాలు తన మనుమరాలిని ఎవరో కిడ్నాప్ చేశారంటూ పోలీసులను ఆశ్రయించింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. రామళ్లకోట పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఆటోలో బాలిక, ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా ఉండటంతో అదుపులోకి తీసుకుని విచారించారు. కిడ్నాప్‌కు గురైన బాలికగా గుర్తించి వెంటనే ఆటోను స్వాధీనం చేసుకుని రామళ్లకోటకు చెందిన లింగమయ్య, జయరాముడు, శేఖర్‌లను అరెస్ట్ చేశారు. బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితుల్లోని లింగమయ్య ప్రేమ పేరుతో బాలికను వేధిస్తూ ఉండేవాడు. ఈక్రమంలో మరో ఇద్దరితో కలిసి కిడ్నాప్ చేసినట్లు విచారణలో తేలింది. నిందితులను డోన్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలకు రూ.4.11కోట్లు

నంద్యాల(సెంట్రల్): ప్యాపిలి మండలం కొమ్మేమర్రులో పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణానికి నిధులు విడుదల చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం రూ.4.11 కోట్ల అదనపు నిధుల విడుదలకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది జీవో నంబర్ 40ని విడుదల చేశారు. శ్రీవెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, డివిజనల్ అభివృద్ధి అధికారి తదుపరి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చిన్నారుల గుండె విలవిల!

- వారికి పుట్టుకతోనే గుండె జబ్బులు
- మేనరిక వివాహాలు, గర్భస్థ ఇన్ఫెక్షన్లు, పోషకాహార లోపమే కారణాలు
- ఉమ్మడి జిల్లాలో ప్రతి వెయ్యి ప్రసవాల్లో పది మందికి సమస్య
- వయసు పెరిగే కొద్దీ మాయమయ్యేవి కొన్ని.. శస్త్రచికిత్సతో పరిష్కారమయ్యేవి మరికొన్ని
- ఈనెల 14న పుట్టుకతో వచ్చే గుండె జబ్బుల అవగాహన దినం



కర్నూలు(హాస్పిటల్): ఇంట్లో ఉన్న చిన్నారికి కాస్త జ్వరం వస్తేనే తల్లిదండ్రుల హృదయం అల్లాడిపోతుంది. జ్వరం ఎప్పుడు తగ్గుతుందా అని అటు మందులు వాడుతూనే మరోవైపు వైద్యుల చుట్టూ తిరుగుతుంటారు. అలాంటిది చిన్నారి గుండెకు సమస్య ఏర్పడితే వారి బాధ చెప్పనలవికాదు. ఇటీవల పలు కారణాల రీత్యా ఒక శాతం మంది పుట్టుకతోనే గుండెజబ్బులతో జన్మిస్తున్నారు. వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఈ జబ్బులు రాకుండా ఎలా ఉండాలనే అంశంపై ఏటా ఫిబ్రవరి 14న పుట్టుకతో వచ్చే గుండెజబ్బులపై అవగాహన దినం నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో 'సాక్షి' పాఠకుల కోసం ప్రత్యేక కథనం.

ఇటీవల కాలంలో పలువురు చిన్నారులకు పుట్టుకతోనే గుండె జబ్బులు వస్తున్నాయి. ప్రతి వెయ్యి మందిలో 8 నుంచి 10 మంది చిన్నారులు గుండె సంబంధిత సమస్యలతో జన్మిస్తున్నారు. మన దేశంలో ఏటా దాదాపు 2.4 లక్షల మంది చిన్నారులు పుట్టుకతో వచ్చే గుండె సమస్యలతో జన్మిస్తున్నారు. 85 శాతం వరకు కారణాలు తెలియవు.. కానీ వంశపారంపర్యంగా 10 నుంచి 15 శాతం మాత్రమే ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి. ప్రతి వెయ్యి మందిలో 1.5-1.7 చొప్పున బాల్యంలో తీవ్రమైన గుండె సమస్యలు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా వెయ్యి మంది పిల్లలు ఈ విధమైన సమస్యతో జన్మిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న డిస్ట్రిక్ట్ అర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డైస్)లో 15 మంది చిన్నారులు గుండెజబ్బులకు చికిత్స తీసుకుంటున్నారు.

గుండెకు వచ్చే సమస్యలు

అతి సున్నితమైన గుండె నిర్మాణం సంక్లిష్టమైనది. పిండంలో 21వ రోజుకే గుండె కొట్టుకోవడం, రక్తప్రసరణ మొదలవుతాయి. గుండె గదులు 4 వారాల కల్లా ఏర్పడుతాయి. 12 వారాలకు గుండె పూర్తిగా అభివృద్ధి చెందుతుంది. ఈ దశలో ఎక్కడ పొరపాట్లు జరిగినా లోపాలకు దారి తీస్తాయి. గుండె రంధ్రాలు(సెప్టల్ డిఫెక్ట్స్). గుండెలోపాల్లో దాదాపు 25 శాతం ఇలాంటి సమస్యలే ఉంటాయి.

చిన్నారుల గుండె జబ్బులకు కారణాలు

పోషకాల లోపం

ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 లోపం గర్భస్థ శిశువులో గుండెలోపాలకు అవకాశం.

గర్భిణికి ఇన్‌ఫెక్షన్లు

తొలి మూడు నెలల్లో పిండంలో గుండె ఏర్పడే దశలో రుబెల్లా వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లు సైతం లోపాలకు దారి తీయొచ్చు.

18 వారాల్లోనే గుర్తించవచ్చు

ఫీటల్ ఎకో కార్డియోగ్రామ్ పరీక్ష ద్వారా గర్భస్థ శిశువుల్లో గుండెలోపాలను 18 వారాల గర్భంలోనే గుర్తించవచ్చు. గుండె లోపాలు ముమ్ముందు ఎలా పరిణమిస్తాయి, బిడ్డ ఆరోగ్యం ఎలా ఉండగలదు అనేవి తెలుస్తాయి. దీన్ని బట్టి ముందుగానే శస్త్ర చికిత్సలను నిర్ణయించుకోవచ్చు. కవాటాలు మూసుకుపోయిన వారికి కొన్నిసార్లు గర్భంలో ఉండగానే సరిదిద్దే పద్ధతులూ అందుబాటులో ఉన్నాయి.

మేనరికపు వివాహాలు

మేనరికపు వివాహం చేసుకున్న వారికి పుట్టబోయే పిల్లల్లో జన్యుపరమైన కారణాలతోనూ గుండె లోపాలు తలెత్తవచ్చు. మేనరికపు వివాహాలు చేసుకున్న వారికి పుట్టబోయే పిల్లల్లో ప్రతి వెయ్యి మందిలో 40 నుంచి 50 మందికి గుండెలోపాలు ఉండే అవకాశం ఉంది. వీరికి ఇతరత్రా లోపాల ముప్పు ఎక్కువే.

జన్యులోపాలు

కొందరికి జన్యులోపాలతోనూ గుండె నిర్మాణ ప్రక్రియ అస్తవ్యస్తం కావచ్చు.

పురుగుల మందులు, రేడియేషన్

గర్భం ధరించిన తొలివారాల్లో పురుగు మందులు, రేడియేషన్, కొన్ని రకాల మందుల ప్రభావానికి గురైనా గుండెలోపాలు తలెత్తవచ్చు. పొగ, మద్యం అలవాట్లు, గర్భధారణ సమయంలో పొగతాగడం, మద్యం తాగడం వంటి అలవాట్లతోనూ గుండె ఏర్పడే ప్రక్రియ అస్తవ్యస్తం కావచ్చు. ఇది లోపాలకు దారి తీయొచ్చు.

అధునాత చికిత్సా పద్ధతులు

గుండె, ఊపిరితిత్తుల పనితీరు అర్థం కావడం, అధునాతన పరికరాలు అందుబాటులోకి రావడం, సుశిక్షితులైన సిబ్బంది, శస్త్రచికిత్స అనంతరం సేవలవంటివన్నీ గుండెలోపాలతో సంభవించే మరణాలకు అడ్డుకట్ట వేయడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అధునాతన చికిత్సలతో చాలా వరకు గుండెలోపాలను పూర్తిగా సరిదిద్దవచ్చు. కొందరికి తొలిదశలో ఆయా లక్షణాల నుంచి ఉపశమనం కలిగించే చికిత్సలు అవసరం కావచ్చు. పూర్తిగా సరిదిద్దడం సాధ్యం కాని వారికి అవసరమైనప్పుడల్లా ఉపశమన చికిత్సలు చేయాల్సి ఉంటుంది. ముందుగానే గుండె రంధ్రాలను గుర్తించగలిగితే సరైన మందులు ఇవ్వడం, ఆహారపరంగా జాగ్రత్తలు పాటించడం ద్వారా దుష్ప్రభావాలు ముంచుకురాకుండా చూసుకోవచ్చు. ఇందుకోసం మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. రక్తహీనత మూలంగా గుండె విఫలమయ్యే ముప్పు పొంచి ఉండటం వల్ల ఐరన్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది.

గుండె వైఫల్య లక్షణాలు

సాధారణంగా గుండెలో రంధ్రాలు ఏర్పడిన వారిలో ఇవి కనిపిస్తాయి. గుండె గదుల మధ్య రంధ్రాలు ఉన్నప్పుడు చెడు రక్తంతో మంచి రక్తం ఎక్కువగా కలిసిపోతుంది. దీంతో ఊపిరితిత్తులకు మరింత ఎక్కువగా రక్తం చేరుకుంటుంది. ఫలితంగా ఊపిరితిత్తులు తడితడిగా అయిపోతాయి. దీంతో పిల్లలు పాలు సరిగా తాగలేరు. ఆయాసం, తరచూ న్యూమోనియా బారిన పడటం వంటివి వేధిస్తాయి.

చర్మం నీలం

చెడు రక్తం, మంచి రక్తం కలిసిపోయి ఒళ్లంతా విస్తరించడం వల్ల పెదాలు, వేళ్లు, నాలుక వంటివి నీలంగా మారతాయి. కొందరికి ఉన్నట్లుండి నీలంగా అవడం ఎక్కువ కావచ్చు. కనుగుడ్లు తేలేయొచ్చు.

నిస్సత్తువ

కవాటాలు బిగుసుకుపోవడం, లీక్ అయ్యేవారిలో అలసట, నిస్సత్తువ వంటివి కనిపిస్తుంటాయి. పెద్ద అయ్యాక శారీరక శ్రమను అంతగా తట్టుకోలేరు. ఆటలకు దూరంగా ఉంటుంటారు. తోటివారితో ఆడుకోవడానికి వెనుకాడతారు.

గుండెలో రంధ్రాలు అధిక శాతం అవే పూడిపోతాయి



గుండెలో పుట్టుకతో ఏర్పడిన రంధ్రాల్లో ఎక్కువ శాతం వాటంతటవే మూసుకుపోతాయి. వీటికి శస్త్ర చికిత్సలు అవసరం లేదు. గుండెలోపాలతో పుట్టిన వారిలో దాదాపు 20 శాతం మందికి పుట్టిన నెల లోపే శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. మిగిలిన వారిలో చాలా మందికి బడికి వెళ్లే వయస్సులో శస్త్రచికిత్స చేయాల్సి రావచ్చు. శిశువుకు, అదీ గుండెకు శస్త్రచికిత్స అంటే భయం కలగడం సహజమే. ఇప్పుడు అంత భయపడాల్సిన పనేమీ లేదు.

– డాక్టర్ జి.సందీప్‌కుమార్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, కర్నూలు

ఆరోగ్యశ్రీలో ఉచితంగా..



గుండెజబ్బులున్న చిన్నారులను కర్నూలు సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగానికి తీసుకురావాలి. అక్కడి వైద్యులు పరీక్షించి వారిని తిరుపతి, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. అన్ని చోట్లా చిన్నారుల గుండెజబ్బులకు ఉచితంగా ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స చేస్తున్నారు. వారి వయస్సు తదితర అంశాలను బట్టి వైద్యులు శస్త్రచికిత్స చేయాలా వద్దా, శస్త్రచికిత్స చేయాల్సి వస్తే ఎప్పుడు చేయాలనేది నిర్ణయిస్తారు.

– డాక్టర్ ఎం.భాస్కరరెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్, కర్నూలు

రహదారి నిబంధనలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: వాహనదారులు రహదారి నిబంధనలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాలకు అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలను నడపటం, నిబంధనలు పాటించకపోవడమే కారణమన్నారు. వాహనదారులకు నిబంధనలు తెలియజేసేలా పోలీస్, రవాణా అధికారులు సంయుక్తంగా అవగాహన సదస్సులు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సోలార్ బ్లింకర్స్‌లైట్లను అమర్చాలన్నారు. బ్లాక్‌స్పాట్‌ల వద్ద వాహనాల వేగం తగ్గేలా బారికేడ్స్‌ను ఏర్పాటు చేయాలని వివరించారు. వాహనాలు డివైడర్లు దాటే ప్రాంతాల వద్ద జీబ్రాలైన్స్ వేయాలని ఆదేశించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించే ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ శివారెడ్డి, ఎన్‌హెచ్ఐఏ అధికారులు సాయి, కార్తీక్, హరినాథ్‌రెడ్డి, సీఐ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

దేశంపై భక్తి నిర్మితం కావాలి



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ హిందూ ధర్మం, దేశం కోసం పనిచేస్తుందని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ చాలక్ మోహన్ భగవత్ అన్నారు. స్థానిక మాంటిస్సోరి ఇండస్ పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఆర్ఎస్ఎస్ విశేష నగర సాంఘిక్‌లో ఆయన ప్రసంగించారు. సమాజ ఉన్నతిలోనే మన ఉన్నతి అనే భావన మనసులో నింపుకుని డాక్టర్ హెడ్గె వార్ ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారన్నారు. ఇదే భావన నేడు దేశమంతా వ్యాపించిందన్నారు. అయితే చాలామందిలో ఈ భావన ఇంకా అంతర్లీనంగానే ఉందన్నారు. దీన్ని బయటకు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సమాజం పట్ల దేశం పట్ల భక్తి నిర్మాణమై, వికసితమైతే శక్తి నిర్మాణం అవుతుందన్నారు. మన శ్రద్ధ నిష్ఠలను తగ్గించుకోకుండా అకుంఠిత దీక్షతో పనిచేయడం ద్వారా సుఖశాంతులతో తులతూగే వికసిత భారతం నిర్మాణం అవుతుందన్నారు. శరీరాన్ని, మనసును, బుద్ధిని ఏకీకృతం చేసి సాధన చేస్తే సత్యం, న్యాయ సమ్మతమైన మార్గంలో ధైర్యంగా ముందుకు సాగుతామన్నారు. విద్యార్థులు, యువకులు, పెద్దలకు జరుగుతున్న సంఘ శాఖల ద్వారా బస్తీల వికాసం జరగాలన్నారు. సమాజ హితం కోసం స్వయం సేవకులు పనిచేయాలన్నారు. సాంఘిక్‌లో నగరంలోని 50 బస్తీల నుంచి 1,287 మంది స్వయం సేవకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో క్షేత్ర సంఘ చాలక్ నాగరాజు, ప్రాంత సంఘ చాలక్ హరికుమార్‌రెడ్డి, విభాగ్ సంఘచాలక్ నీలకంఠం, జిల్లా సంఘ చాలక్ ఎన్‌వీఎస్ గుప్తా, నగర సంఘ చాలక్ చల్లా వాసురెడ్డి పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన 'చిన్నటేకూరు' విద్యార్థులు

కల్లూరు: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించిన జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో మండలంలోని చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ-మెడికల్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 55 మంది విద్యార్థులకు గానూ 11 మంది విద్యార్థులు 90 పర్సెంటైల్‌పైన సాధించినట్లు అకాడమీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుజాతరెడ్డి తెలిపారు. విద్యార్థి వి.సంతోష్ 98.75 పర్సెంటైల్ సాధించాడన్నారు. అత్యధిక పర్సెంటైల్‌తో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అభినందించారు.

విద్యార్థి పేరు	జేఈఈ రిజిస్టర్ నెం.	పర్సెంటైల్
వి.సంతోష్	240310404462	98.75
ఎం.అభిషేక్	240310131188	95.26
ఆదరణ కుమార్	240310393985	95.09
ఎ.రాజశేఖర్	240310240934	94.48
జి.అజయ్	240310488959	93.07
గురు ప్రసాద్	240310402404	93.05
ఎస్.రాఘు	240310704448	92.36
మధన్ కుమార్	240310044552	91.99
బి.శ్రీనివాసులు	240310039099	91.83
జి.గణేష్	240310197319	90.77

ఓట్ల లెక్కింపు కేంద్రాలకు భవనాల పరిశీలన

నంద్యాల(అర్బన్): వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి స్థానిక అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంల భద్రతా రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలను జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డిలతో కలిసి మంగళవారం పరిశీలించారు. వచ్చే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గాల వారీగా పోలింగ్ అనంతరం ఈవీఎంల భద్రతా భవనాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలను కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోని అబ్దుల్ కలాం బ్లాక్‌లో 13 రూములు, సీ బ్లాక్‌లో 12 రూములు ఓట్ల లెక్కింపు కేంద్రాలకు విడివిడిగా గుర్తించిన భవనాలను పరిశీలించారు. ఒక్కో నియోజకవర్గానికి అసెంబ్లీకి రెండు భవనాలు, పార్లమెంట్‌కు రెండు భవనాలు చొప్పున నాలుగు భవనాలు, ఆరు నియోజకవర్గాలకు 24 భవనాలతో పాటు అన్ని నియోజకవర్గాల పోలింగ్ సిబ్బందికి, సెక్యూరిటీ సిబ్బందికి అవసరమయ్యే భవనాలను కూడా పరిశీలించి ఏర్పాట్లపై చర్చించారు.

సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐజీ విజయరావు, ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 15న కర్నూలు పర్యటన సందర్భంగా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 15న ఎమ్మిగనూరు శాసనసభ్యులు చెన్నకేశవరెడ్డి మనవడు పవన్‌కల్యాణ్ రెడ్డి వివాహ వేడుక కర్నూలు బళ్లారి రోడ్డులోని కింగ్ ప్యాలెస్ గ్రాండ్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి భద్రతాపరంగా తీసుకోవలసిన చర్యలు, ఏర్పాట్లను కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు, ఎస్పీ కృష్ణకాంత్ మంగళవారం పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాల ని క్షేత్రస్థాయి అధికారులను డీఐజీ ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే రహదారులు, రూట్ బందోబస్తును కూడా డీఐజీ, ఎస్పీ పరిశీలించి అక్కడి పోలీసు అధికారులు, సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజు, కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, ట్రైనీ డీఎస్పీ భావ న, సీఐలు నాగరాజు యాదవ్, శ్రీనివాసరెడ్డి, శంకరయ్య, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన ఎస్‌డీఆర్ విద్యార్థులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డీఎస్పీ కె.రవీంద్రారెడ్డి తదితరులు

నంద్యాల(న్యూటౌన్): జేఈఈ మెయిన్ 2024 పరీక్షల్లో ఎస్‌డీఆర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ మేరకు ప్రతిభ చాటిన విద్యార్థులను మంగళవారం డీఎస్పీ కె.రవీంద్రారెడ్డి, ఎస్‌వీఆర్ కళాశాల చైర్మన్ వెంకటరామిరెడ్డి తదితరులు అభినందించారు. జేఈఈ మెయిన్ ఫలితాల్లో మోహన్ కృష్ణ 99.95 పర్సంటైల్ సాధించి ప్రతిభ చూపారు. అలాగే జితేంద్ర 99.36 పర్సంటైల్, కె.నాగపవన్‌కుమార్ 97.63, వి.కార్తికేయరెడ్డి 96.78, 90 పర్సంటైల్‌తో మొత్తం 18 మంది అద్భుతమైన ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. ఇందుకు కృషి చేసిన విద్యార్థులను, అధ్యాపకులను ఎస్‌డీఆర్ కళాశాల చైర్మన్ కొండారెడ్డి అభినందించారు. అత్యాధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో సీఐ మంజునాథ రెడ్డి, డాక్టర్ గెలివి సహదేవుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మూడు ఎర్రమట్టి టిప్పర్లు సీజ్

కర్నూలు (న్యూటౌన్): కల్లూరు మండలం ఉలిందకొండ పరిధిలో అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లను మంగళవారం సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. మూడు టిప్పర్లను పట్టుకుని రూ.36 వేల అపరాధ రుసుం విధించామన్నారు. ఆదోని సమీపంలోని ఎస్ కొండాపురం వద్ద అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న మరో లారీని పట్టుకున్నామన్నారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ పాల్గొన్నారు.

వేడి వంట పాత్రలో పడి బాలుడికి గాయాలు

- నంద్యాల ఆసుపత్రికి తరలింపు

చాగలమర్రి: ప్రమాదవశాత్తు ఓ బాలుడు వేడి వంట పాత్రలో పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రం చాగలమర్రిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక కోటగడ్డ వీధికి చెందిన సుబ్బయ్య, సువర్ణలకు ఇద్దరు సంతానం. వీరు కవలలు. సుబ్బయ్య మంగళవారం కుటుంబ సమేతంగా సమీపంలో బంధువుల గృహ ప్రవేశానికి వెళ్లాడు. అక్కడ సుబ్బయ్య నాలుగేళ్ల కుమారుడు జయసింహ ఆడుకుంటూ అప్పటికే వండిన వేడి మటన్ పాత్రలో పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు వెంటనే గమనించి బయటకు తీశారు. చికిత్స నిమిత్తం వెంటనే 108లో నంద్యాల ఆసుపత్రికి తరలించారు. ఆసరా చెక్కుల పంపిణీ నిమిత్తం చాగలమర్రికి వచ్చిన ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి విషయం తెలియడంతో వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

ఆరు సబ్జెక్టులు.. ఏడు పరీక్షలు

- పదో తరగతి పరీక్ష విధానంలో స్వల్ప మార్పులు
- సైన్స్ సబ్జెక్టుల్లో మళ్లీ రెండు పరీక్షలు
- మార్చి 18 నుంచి పరీక్షలు ప్రారంభం
- పరీక్ష సమయంలో 15 నిమిషాలు పెంపు



నంద్యాల ప్రభుత్వ బాలికల పాఠశాల పదవ తరగతి విద్యార్థినులు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం పరీక్షల విధానంలో మార్పులు చేపట్టింది. గత విద్యా సంవత్సరంలోనే భారీ మార్పులకు శ్రీకారం చుట్టగా, ఈ ఏడాది పది పరీక్షల విధానంలో స్వల్ప మార్పులు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. నాడు-నేడు, జగనన్న అమ్మఒడి, ఒకటో తరగతి నుంచే ఇంగ్లిషు మీడియం, సీబీఎస్ఈ పాఠశాలల్లోనే జూనియర్ కళాశాలల ఏర్పాటు ఇలా పలు నూతన సంస్కరణలకు నాంది పలికారు. వీటిలో భాగంగానే ఈ ఏడాది పది పబ్లిక్ పరీక్షల్లో ఆరు సబ్జెక్టులను ఏడు పరీక్షలుగా నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా పదో తరగతిలో 11 పరీక్షలను నిర్వహించే వారు. హిందీ మినహా తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషల్ సబ్జెక్టుల్లో ప్రతి సబ్జెక్టుకు 50 మార్కుల వంతున రెండు పేపర్లు నిర్వహించే వారు. సైన్సులో ఫిజికల్ సైన్స్, బయాలజీ సబ్జెక్టుకు 50 మార్కుల వంతున రెండు పేపర్లు ఉండేవి. ఒక్కో పరీక్షను ఒక్కో రోజు వంతున 11 రోజుల పాటు పరీక్షలు నిర్వహించేవారు. కరోనా ప్రభావంతో 2019-20, 2020-21 విద్యా సంవత్సరాల్లో పబ్లిక్ పరీక్షలను రద్దు చేశారు. కరోనా తీవ్రత తగ్గడంతో 2021-22 విద్యా సంవత్సరంలో పబ్లిక్ పరీక్షలు నిర్వహించగా, 11 పేపర్లను ఏడు పేపర్లకు కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సోషల్ సబ్జెక్టులకు ఒక్కో పేపరుకు 100 మార్కులకు వంతున పరీక్ష నిర్వహించగా, ఫిజికల్ సైన్స్, బయాలజీ సైన్స్ పేపర్లను ఒక్కో పేపరుకు 50 మార్కుల వంతున నిర్వహించారు. 2022-23 విద్యా సంవత్సరంలో పది పబ్లిక్ పరీక్షలను ఆరు పేపర్లకు కుదించారు.

2023-24 నుంచి మళ్లీ ఏడు పేపర్లు

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరు సబ్జెక్టులకు ఏడు పరీక్షలు నిర్వహిస్తున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సోషల్ సబ్జెక్టులను వంద మార్కుల వంతున నిర్వహిస్తున్నారు. సైన్స్ పేపరును మాత్రం రెండు పరీక్షలుగా నిర్వహిస్తున్నారు. ఫిజికల్ సైన్స్ 50 మార్కులకు, బయాలజికల్ సైన్స్ పేపరు 50 మార్కులకు నిర్వహిస్తున్నారు. పరీక్ష సమయాన్ని కూడా ప్రభుత్వం మార్పు చేసింది. గతంలో ఈ సమయం మూడు గంటలు ఉండగా, ఇప్పుడు 15 నిమిషాలు పెంచారు. ఈ 15 నిమిషాల వ్యవధిలో ప్రశ్నపత్రం చదవడానికి, రాసిన సమాధానాలు సరిచూసుకోవడానికి కేటాయించాలనే ఉద్దేశంతో ఈ మార్పు చేశారు. గత ఏడాది పరీక్షకు పరీక్షకు మధ్య ఒక రోజు గడువు ఉండగా, ఈ ఏడాది వరుసగా రోజుకొక పరీక్షను నిర్వహిస్తున్నారు.

అవగాహన కల్పించాం

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఈ ఏడాది మారిన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాం. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఏడు పేపర్ల విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆరు సబ్జెక్టులకు ఏడు పేపర్లు నిర్వహిస్తున్నారు. 2024-25లో సీబీఎస్ఈ విధానంలో పది పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు సైన్స్ పరీక్ష విషయంలో గందరగోళానికి గురవకూడదని సైన్స్ పరీక్షను వేర్వేరు రోజుల్లో ప్రభుత్వం నిర్వహిస్తోంది.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల